# బటర్ మిల్క్ బెనారస్ సిల్క్!

వెలిచల సాంబశివరావు

"ఏయ్... బటర్ మిల్క్... ఇట్రా!"

"ఏమిటి బెనారస్ సిల్క్ ... పిలిచావా?"

అన్నాడు ఆతగాడు అంతకన్నా ఎద్దేవాగా.

వాళ్ళ పిలుపులు విన్న ఆ పెళ్ళి ఇంట్లోని వాళ్ళందరికీ మతులు పోయాయి. పలుపులు తెంచుకున్న కోడెల్లా, వాళ్ళలో ఆశ్చర్యాలు అంతు లేకుండా పోయాయి. ఎందుకంటే ఆ అమ్మాయికి ఆ అబ్బాయిగానీ, ఆ అబ్బాయికి అమ్మాయిగానీ ఇంతకుముందెన్నడూ తారసపడిన సంఘటనలు గాని, సన్నివేశాలు పిసరంతైనా లేవు. మేనత్త మేనమామ బిడ్డలు అసలే కాదు. పట్టాభి రామయ్యకు మనస్సు కాస్తంత కాదు, బాగానే చివుక్కుమనిపించింది.

ముక్కూ మొహం తెలియని ఆ అమ్మాయి, తన కొడుకునే ఆ విధంగా హేళన చేస్తూ అంటే, అంతమందిలో తల తీసేసినట్లే అయింది. చెంప ఛెళ్ళుమనిపించిందేమో, చెంపను చేతులతో రాసుకున్నాడు చాటుమాటుగా.

"ఏంటిది పట్టాభీ! నీ కొడుకును అలా అంటున్నదేమిటి?" అంటూ పళ్ళికిలిస్తూ ఆ ప్రస్తావనను కొండంత చేయడానికి న్యాయవాదిగా వున్న నరసయ్య నసిగాడు, కాదు గొణిగాడు.

ఏం చెప్పాలో పట్టాభికి పాలుపోలేదు. అంతలో పురోహితుడు పట్టాభిరామయ్యను కొత్త దంపతులను ఆశీర్వదించాలంటూ పిలిచాడు. గండం గడిచినట్లు అయింది.

నరసయ్య ప్రక్కనే కూర్చున్న దత్తు సుబ్బారావు కించిత్తు కల్పించుకున్నాడు. "అబ్బాయ్ నరసయ్యా! ఆ అమ్మాయి, అబ్బాయి ఆ విధంగా ఒకర్నొకరు ఆట పట్టించు కోవటంలో ఆశ్చర్యమే మున్నది? అడవిలోని ఉసిరికాయకు కడలిలోని ఉప్పుకు చప్పున పొత్తు కుదిరినట్లే. వాళ్ళిద్దరూ ఎక్కడో ఎప్పుడో మాటా మంతీ కలిసి ఉంటుంది. చివరికది ఇంతై అంతై ఎకసక్కేనికి దారితీసి ఉంటుంది. పెళ్ళిళ్ళు కూడా పదిమంది కళ్ళ ముందు జరగడం లేదు. ఇంక ప్రేమలకు ప్రం ఆడ్రస్సులు ఎక్కడ ఉంటాయి? ఆ మాత్రం విషయం నీకు తెలియదా ఏంటి నరసయ్యా!" అన్నాడు సుబ్బారావు ప్లస్ దత్తు గమ్మత్తుగా.

అంతటితో ఆ విషయం అక్కడ ఆగిపోయింది అనుకోవటానికి వీల్లేదు. ఇప్పుడు అందరి చూపులూ వాళ్ళిద్దరి మీదా పడ్డాయి.

"మరేం లేదు బటర్‌మిల్క్! సత్యనారాయణ వ్రతం కాగానే భోజనాలు పెడతారు గదా! ఆ భోజనాలు కాగానే..."


"ఇస్తళ్ళు నువ్వు తీస్తావా?..."

"యూ షటప్... మొత్తానికి పల్లెటూరి మొద్దువైనాఎద్దేవాకేమీ తక్కువ లేదులే... నీ పంచెకట్టు... సైన్ బట్టతో కుట్టిన ఆ చేతుల బన్నీ వేసుకుంటే అచ్చం రాక్షసుడిలా ఉన్నావ్..."

"రాక్షసుడిలా ఉంటమేమిటి బెనారస్ సిల్క్... నిజంగా నేను రాక్షసుడినే.. నువ్వాక దేవకన్యవని నిన్ను తీసుకుపోవటానికి వచ్చాను..."

"యూ... విలేజ్ లేజీఫెలో ... అస్సలు నిన్నీ పందిట్లోకి ఎవ్వరు రానిచ్చారు... ఎందుకు వచ్చావ్?"

"నువ్వేగా బటర్‌మిల్క్ అని పిలిచింది. అందుకే వచ్చాను..." అన్నాడు నెమ్మదిగా.



"చదువు సంధ్యలు లేకపోయినా వేషాలకేం తక్కువ లేదులే! కాసుల కోసం వేషాలు వేయక తప్పదు మరి..." అన్నది ఆ అమ్మాయి.

"అమ్మాయ్! నువ్వు ఎవ్వరివో ఏమిటో మాకు తెలియదు. నువ్వూ మా వాడు క్లాసుమేట్లా ఏమిటి? అంత అభిమానంగా మాట్లాడుకుంటు న్నారు" అని అడిగాడు ఒక పెద్దాయన, కళ్ళజోడులో నుంచి ఆ అమ్మాయిని క్రింది మీదుగా మరీ మరీ పరికించి చూస్తూ.

"నేను ఎవరినో ఏమిటో తెలియదా? నా తడాఖా చూపించాలంటే ఓ క్షణం పట్టదు. అయినా దానికిప్పుడు సమయం కాదు కాబట్టి ఒక్క మాటతో చెప్పాలంటే అక్కడ జరుగుతున్న సత్యనారాయణ వ్రతం భర్తతో చేసుకుంటున్న ఆ పెళ్ళి కూతురు నా ప్రాణ స్నేహితురాలు. నా మాటంటే వేదం. నేనిప్పుడు లేచి రమ్మంటే టక్కున వస్తుంది..." అన్నది మహా ఉడుగ్గా.

"మంత్రాలకు చింతకాయలు రాలతాయేమో గానీ, నువ్వు చెయ్యెత్తి పిలిచినా ఆ క్రొత్త పెళ్ళి కూతురు కనీసం నీ వంక తల ఎత్తి కూడా చూడదు బెనారస్ సిల్కూ..." అన్నాడు.

"ఉడుత ఊపులకు కొబ్బరికాయలు కూడా రాలవచ్చు గానీ, నీ పిడివాదానికి పిల్లి కూడా భయపడదు బటర్‌మిల్కూ..." అన్నది.

"పవిత్రమైన బెనారస్ సిల్కూ అని నిన్ను పిలిచి, దానికి తలవంపులు తెచ్చాను. ఇంక నిన్ను ఆ పేరుతో చచ్చినా పిలవను".

"ప్రతి ఇంటినీ చల్లగా చూసే బటర్‌మిల్క్‌ను నీకు పేరుగా పెట్టి నిన్ను పిలిచి, దానికి చిన్నతనము తెచ్చాను... నా జీవితంలో నిన్నింక ఆ పేరుతో పిలిస్తే..."

"చచ్చినంత ఒట్టా...?"

"కాదు... బ్రతికినంత ఒట్టు..."

"బెనారస్ సిల్కూ..."

"బటర్‌మిల్కూ..."

"ఇంతకూ నన్నెందుకు పిలిచిందీ చెప్పలేదు..."

"చెబుతాను... జరిగిన విషయం చెప్పి ఇంతమందిలో నీ పరువు తీస్తాను.."

"చదువురాని మొద్దును, రూపంలో రాక్షసుడిని, నిరక్షరకుక్షిని, అక్కుపక్షిని, నీకు ప్రత్యక్ష సాక్షిని, కళ్ళు సరిగా కనిపించని ఏకాక్షిని, నాకు పరువేంటి? ప్రతిష్ఠేంటి? వున్నవాళ్ళ ముందు తిష్టవేసేవాడిని. నీ లాంటి వాళ్ళుంటే నిష్ఠగా వుండేవాడిని. ఇప్పటి రోజుల్లో వంటికి వేసుకున్న బట్టల్లాగే, పరువు తీయటం కూడా చాలా తేలికా, సులువైపోయిందమ్మా... ఇంకా ఆలస్యమెందుకూ ఈ పెళ్ళి పందిట్లో నా పరువు తీసేయండి..." అన్నాడు బటర్‌మిల్కు.

అతని వాలకం, మాట్లాడే తీరు చూసి, బెనారస్ సిల్కు అయోమయంలో పడింది. అంతలోనే అతగాడికి మెంటల్ కూడా అనుకుంది.

"నీకు మెంటల్ కూడా వున్నట్టుందే" అన్నది.

"మెంటల్ కాక మరేంటనుకున్నావ్? మెంటల్.... ముమ్మాటికీ మెంటలే... మెంటల్ లేనిదెవ్వడికి? ప్రతివాడికీ మెంటలే... అందమైన అమ్మాయిని చూస్తే ఒకడికి మెంటల్, సిటీలో పెరిగి, యూనివర్శిటీలో చదివి, బ్యూటీ క్లినిక్‌లలో ఫ్యాషన్‌లు నేర్చుకుని పాటించి పండుగలకు పబ్బాలకూ, పెళ్ళిళ్ళకూ పేరంటాలకూ, పల్లెటూళ్ళకు వచ్చిన మీ లాంటి వాళ్ళకు చదువులేని వాడిని, అందులో నాబోటి వాడిని, నీ బోటి కంట్రీ క్యాట్ ఆట పట్టించడం మెంటల్ కాదా మేడమ్?" అన్నాడు బటర్‌మిల్క్.

"బట్టర్‌మిల్కుకు అలాంటి బట్లర్ ఇంగ్లీషు రావడం సహజమేలే..."

"అవునవును... నేనే మేలే... నన్ను మేలే అని ఒప్పుకున్నారు గదూ...." అంటూ అతడు గంతులు వేయబోయి ఆగిపోయాడు.

"గంతులు, వేయబోయి ఆగిపోయావెందుకు?" అడిగింది కోపంగా....

"ఇక్కడైతే బావుండదని... ఇద్దరమొక్కటైతే... ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అలుపూ సొలుపూ వుండదని... ఇంక ఎదురేమీ ఉండదని..." అన్నాడు. కొత్త దంపతుల్ని ఎవ్వరూ పట్టించుకున్నట్లు లేదు. అందరూ బటర్‌మిల్కును, బెనారస్ సిల్కులను వింతగా చూడసాగారు. ఆ విషయం గమనించిన బెనారస్ సిల్క్ కాస్తంత సిగ్గుతో "అంతా మన వంకే చూస్తున్నారు. కొంచెం మీ ధోరణి ఆపండి..." అన్నది.

"అలా దారికి రండి..." అన్నాడు బటర్ మిల్కు కూడా ఆ మాట అమ్మాయికి మాత్రం వినిపించేట్లుగా.

"నీకూ మర్యాద తెలుసే?" అన్నది.

"అవును గదండీ! అమ్మాయిగారూ! రేపు పెళ్ళయిన తర్వాత పెళ్ళాం చెప్పినట్టు వినటం, ఇప్పట్నుంచే అలవాటు చేసుకోవాలిగా! అందుకని..."


"అందుకని..."

"అందుకని నువ్వు చెప్పినట్టే మాట్లాడ్డం ఆపేయమనగానే ఆపేసానుగా..." అన్నాడు ముద్దుగా మొద్దబ్బాయిలా.

"నువ్వేం ఆపేసినా... నువ్వు చేసిన పని వీళ్ళందరి ముందూ చెప్పక తప్పదు..."

"తప్పదంటావా...?"

"తప్పదు... ఇప్పుడే చెప్పేస్తాను. ఇందాక నన్ను నువ్వు ఎవరివో ఏమిటో మాకు తెలియదు. నువ్వూ మావాడూ క్లాసుమేట్లా ఏమిటీ అని ఆ తాతగారు ఎవరో అడిగారు కదూ..."






"ప్రభుత్వాలు" ప్రజల మీద ఏ "పన్నూ" వెయ్యకుండా ఎప్పుడు వుంటుంది?

లంచగొండి అధికారుల ఆస్తుల్ని "జాతీయం" చేసినప్పుడు!

✣ ✣ ✣

శ్రీరాముడు "శివధనుస్సు"ను వంచడం దేనికి?

"రామాయణ గాథ" లోకంలో "చోటు" చేసుకోవడానికి!

✣ ✣ ✣

"టాక్సీలు" ఎందుకు?

"డ్రైవర్లు" "ఓనర్లు"గా మారడానికి!

✣ ✣ ✣

ఆడవాళ్ళకు "కొప్పు" దేనికి?

"జడపిన్నుల పరిశ్రమ"ను పోషించడానికి!

✣ ✣ ✣

"అభివృద్ధి ఎప్పుడు "గంగ"లో కలుస్తుంది?

పనిచేసేది పదిమందీ - "అధికారులు" అరవైమందీ ఉన్నప్పుడు!

✣ ✣ ✣

ఎవరి "జేబు" "బరువు"గా వుంటుంది?

జేబుదొంగ "జేబు"!

✣ ✣ ✣

రక్షకభటులకు "తుపాకులు" దేనికి?

వాళ్ళని వాళ్ళు రక్షించుకోడానికి!

✣ ✣ ✣

"చమురు కంపెనీలు" మన దేశంలో ఎందుకు?

15 రోజులకోసారి "పెట్రోలు ధరలు" పెంచడానికి!

✣ ✣ ✣

బ్యాంకుల "వడ్డీ రేట్లు" తగ్గించడం దేనికి?

కోట్లు "ఆదా" చేసుకోడానికి!

✣ ✣ ✣

"సినిమా రంగం"లో "అభివృద్ధి" ఎలా ఉంటుంది?

"మేకప్‌మాన్" కూడా "నిర్మాత"గా మారడం!

"నాకింకా పిల్లలే పుట్టలేదు. నా వయస్సు అరవై అయినా తాతనెట్లా అవుతున్నానమ్మా?" అన్నాడు ఆ పెద్దాయన.

"అవును మరి. మీరు తాత కానే కారు... అందుకని మిమ్మల్ని లిటిల్ అంకుల్ అని అంటాను. మీకు ఆనందమే గదా..." అన్నది.

"మహదానందం... అంతకన్నా మరింకేమీ కావాలి కుమారీ..." అన్నాడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఆ పెద్దాయన - సారీ పిల్లలు లేని సంసారి.

"మీకు మొదట్లోనే చెప్పానుగా... ఈ క్రొత్త పెళ్ళికూతురు, నా ప్రాణ స్నేహితురాలని, దీని పెళ్ళికి ముఖ్యమైన గ్రూప్ వన్ పరీక్ష రాయాల్సి వచ్చి నేను హాజరు కాలేకపోయాను. అందువలన వ్రతానికైనా రాకపోతే బావుండదని...

"అవునండీ! పెళ్ళి విందు మానుకుని, చివరకు వ్రతం భోజనం మానుకుంటే బావుండదు గదండీ" అన్నాడు బటర్‌మిల్క్ నామధేయుడు.

"అసలు విషయాన్ని ఆ అమ్మాయిని చెప్పనీయ్. మధ్యలో నువ్వేంటిరా? పడగ్గదిలో పుడకలా" అని మందలించాడు లిటిల్ అంకుల్.

"బాబోయ్' మా బాబాయ్ ప్రేమలో పడ్డాడు. మా పిన్నమ్మ ఎక్కడుందో పిలుచుకొస్తాను" అంటూ ఉడికించాడు బటర్‌మిల్క్.

"వాడంతేలే బేబీ నువ్వు చెప్పు" అన్నాడు లిటిల్ అంకుల్.

రవ్వంత నవ్వింది బెనారస్ సిల్క్.

ఆ అమ్మాయి నవ్వటం చూసి లిటిల్ అంకుల్ తల దువ్వటం సాగించాడు.

"ఆ అమ్మాయిది మన ఊరు కాదని, పొరుగూరు అమ్మాయి అని, మీరంతా ఇదిగా అదిగా సంబరపడి పోతున్నారు. నేను నాయనమ్మ చెవిలో ఈ విషయం వేయక మానను. నీ తిక్క తీయక మానను... తాతా" అంటూ లిటిల్ అంకుల్‌కి వార్నింగిచ్చాడు బటర్‌మిల్క్.

లిటిల్ అంకుల్ ముఖంలో నెత్తురు చుక్క మచ్చుకైనా కనిపించలేదు. వాడిపోయిన కాడలా వాడిపోయాడు. లిటిల్ అంకుల్ అలా అయిపోయే సరికి వుసూరుమంది బెనారస్ సిల్క్.

"అంటే కట్టెలు లేకుండానే, ఎండ బాగా మండిపోతుందన్న మాట..." మధ్యలో అడ్డుపడ్డాడు బటర్‌మిల్క్.

"నువ్వు ఆ విధంగా మధ్యలో మాట్లాడుతుంటే నాకు వళ్ళు మండిపోతుంది..."

"కోపంలో మనిషిని మండించే సుగుణం వుందిగా..."

కసిగా మాట పైకి అన్నా, బెనారస్ సిల్క్ ముసిముసిగా నవ్వబోతూ రుసరుసలాడుతూ చూసింది.

"ఆడవారి మాటలకు రెండు మూడు అర్థాలులే..." అన్నాడు.

"సంతోషించాం గానీ నువ్వు కాస్త నోరు మూస్తే మంచిది. ఊరుకుంటుంటే మరీ జాస్తి అయిపోతోంది. నా స్నేహితురాలి మామగారితో చెప్పి నువ్వు చేస్తున్న అల్లరంతా చెప్పి నిన్ను ఏం

**(22వ పేజీ చూడండి...)**

## బటర్‌మిల్కు-బెనారస్ సిల్కు!

(19వ పేజీ తరువాయి)

చేయించాలో అది చేయిస్తాను..." అన్నది చివరి హెచ్చరికగా బెనారస్ సిల్కు.

"అంత పని చేయకు తల్లీ! నేను ఆ అయ్యగారి ఇంట్లోనే ఉండేది. వున్నదీ లేనిదీ చెప్పి నా నోటికాడి కూడు తీయకండి" అన్నాడు.

"అలా దారికి రా... ఎండ బాగా మండిపోతోందని చెప్పాను గదండీ... అందుకు మహా దాహం వేసిందండీ. ఆ ప్రక్కనే ఉన్న కూల్‌డ్రింక్స్ షాపు దగ్గరికి వెళ్ళి కూల్‌డ్రింక్స్ ఉన్నాయా అని అడిగాను. ఆ కొట్టువాడు లేవన్నాడు. ఏది అడిగినా లేదన్నాడు. బటర్‌మిల్కు వుంటే, లేవంటున్నావేంటి అన్నాను. ఆ ప్యాకెట్లన్నీ ఫంక్షన్ వాళ్ళు తీసుకున్నారు. వాటిని తీసుకున్నది ఈ అబ్బాయే అని ఈయన్ను చూపించాడు ఆ షాపాయన. అప్పుడు నేను ఈయన్ను బటర్‌మిల్కు ప్యాకెట్లు రెండు ఇస్తావా? అని అడిగాను. ఇవ్వనన్నాడు. వాటి రేటు కంటే ఎక్కువ ఇస్తానులే. ఊరికే అక్కర్లేదు అన్నాను. నా మాటలకు ఇతగాడు ఫోజు కొడుతూ, వాటి రేటు కంటే ఎక్కువ ఇస్తాననన్నావు కాబట్టి ప్యాకెట్టుకు వంద రూపాయలు చొప్పున ఇవ్వు... అక్కడికీ వీటిని లెక్క ప్రకారం ఫంక్షన్ తీసుకెళ్ళాలి. నువ్వేదో ఆడకూతురివి, ఖరీదైన బెనారస్ సిల్కు వోణీ పరికిణీ వేసుకున్న పూబోణివి కాబట్టి అని ఈయన రెండు బటర్ మిల్కు ప్యాకెట్లు ఇచ్చి రెండొందలు తీసుకున్నాడు..."

"ఏమిటీ గ్లాసెడు మజ్జిగ వంద రూపాయలా..." అంటూ లిటిల్ అంకుల్‌తో పాటు అక్కడి వాళ్ళందరూ ముక్కులమీద వేళ్ళేసుకున్నారు.

"నేను రెండు ప్యాకెట్లు తాగినా దాహం తీరలేదు. అందుకని పైసలకన్నా, ప్రాణాలు ముఖ్యమని మరో రెండు వందలిచ్చి రెండు ప్యాకెట్లు తీసుకున్నాను".

"అంటే నాలుగు గ్లాసులు వుండే మజ్జిగ నాలుగు వందల రూపాయలా...?" అంటూ వాపోయాడు లిటిల్ అంకుల్.

"అంత కక్కుర్తి పడ్డాడు కాబట్టే అతగాడికి బటర్‌మిల్కు అని బిరుదునిచ్చాను అంకుల్" అన్నది.

"మహా మంచి పని చేశావ్ బేబీ!" అన్నాడు అంకుల్.

"మరి నా మాట కూడా వినండి. ఆ అమ్మడు అంత ఖరీదైన బెనారస్ సిల్కు వోణీ, పరికిణీతో రాయల్ ఫ్యామిలీ నుంచి ఊడిపడిన యువరాణిలా వుండేసరికి, వుండలేక బెనారస్ సిల్కు అన్నాను తాతగారూ..." ఏదో సంజాయిషీ చెప్పినట్టుగా అన్నాడు బటర్‌మిల్కు.

అతడు ఆ విధంగా అంటున్నందుకు అతడి వంక ఆశ్చర్యంగా చూడకుండా వుండలేకపోయింది బెనారస్ సిల్కు.

"ఆ అబ్బాయి నిన్ను బెనారస్ సిల్కు అన్నాడని ఇక ఆ పేరుతోనే వుండేపోతావేంటి? నీకు అసలు పేరు లేదా...?" అన్నాడు అంకుల్.

"లేకేం అంకుల్! వుంది. నా అసలు పేరు బేబీ సరోజినీ... మీరు బేబీ... బేబీ... అని పిలుస్తుంటే నా ముద్దుపేరు మీకెట్లా తెలిసిందా అని ఒకప్రక్క, తాతయ్యే మనుమరాలిని ఆ విధంగా పిలుస్తున్నాడని రెండో ప్రక్క సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాను... థ్యాంక్యూ తాతగారూ..." అంది.

"ఒరేయ్ అబ్బాయ్... నిన్ను వ్రతం దగ్గరికి పిలుస్తున్నారు..." అని చెప్పాడు ఒకాయన.

"వ్రతం కావస్తున్నట్టుంది. భోజనాల ఏర్పాట్లు చూడాలేమో... వెళ్ళు బాబూ వెళ్ళు..." అంటూ లాలనగా హేళన చేస్తూ అన్నది ఆ లలనామణి బేబీ సరోజిని.

"అలాగే అమ్మగారూ..." అంటూ అతి వినయం ప్రదర్శించి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు బటర్‌మిల్కు బాబు.

* * *

ఊరు వెళ్ళిపోవటానికి సిద్ధమవుతున్నది బేబీ సరోజిని.

"ఏంటే సరూ! చరాచరా సర్దుకుంటున్నావు. రెండు రోజులుండి ఇక్కడికి దగ్గర్లో వున్న భట్టిప్రోలులోని బుద్ధుని పేరున పిలవబడే దిబ్బను చూస్తానన్నావుగా..." అన్నది స్నేహితురాలి ప్రవర్తనకు విస్తుపోతూ సీతాకుమారి.


"బయలుదేరే ముందు అన్నది నిజమే. వచ్చిన తర్వాత పరిసరాలను బట్టి, మార్పులు, చేర్పులు జరగటం సహజమే గదా..." అన్నది బేబీ సరోజిని.

అంతలో అక్కడకు వచ్చాడు బటర్‌మిల్కు.

"అమ్మాయ్‌గారూ! మీరు ఇక్కడ ఉన్నారా... మీరు ఎక్కడ వుండేది కాస్త మీ అడ్రసు రాస్తే..."

"ఎందుకు అక్కడకు కూడా వచ్చి నా ప్రాణాలు తీయటానికా?" అన్నది.

"అందుక్కాదు అమ్మాయిగారూ! మీకు



అన్యాయంగా చిన్న మజ్జిగ ప్యాకెట్టు వంద రూపాయలకిచ్చి నాలుగు వందలు సొమ్ము చేసుకున్నాను. నాకిప్పుడు ఆదాయమేమీ లేదు. ఎప్పటికైనా రెక్కల కష్టం చేసి మీరిచ్చిన రొక్కం తీర్చుకుంటాను...'' అంటూ అడ్రసు రాసివ్వటానికి కాగితం అందించబోయాడు.

సరోజిని ఆ కాగితాన్ని తీసుకుని దూరంగా విసిరేసింది. 'నేనిప్పుడు ప్రయాణం తొందర్లో వున్నాను. నన్ను విసిగించకుండా అవతలికి వెళ్ళు... అయినా ఇతను చదువుకుంటే బాగా పైకొచ్చేవాడు. ఇతనికి చదువు అబ్బలేదా?'' అంది సీతాకుమారి వైపు చూస్తూ.

"ఇతని గురించి నాకు అంత పెద్దగా తెలియదే... నిన్ననేగా నేను ఇంట్లో కాలు పెట్టింది. ఈ ఇంట్లో అందరికీ అతడే తలలో నాలుకగా వుండడం గమనించాను'' అన్నది సీతాకుమారి.

"అలా మనుషుల్ని అంటిపెట్టుకొని ఉన్నట్లు నటిస్తే నాలుగు డబ్బులు సంపాదించుకోచ్చని చేస్తుంటాడు కాబోలు ట్రిక్కు... అమ్మో! మాటల్లో పడి నా ప్రయాణం మాటే మరిచాను...''

"సరూ! ఇలా వచ్చి అలా నేరుగ వెళ్ళిపోతే యెట్లాగే... నువ్వు తప్ప నాకింక ఎవరున్నారే...'' అంటూ దీనంగా చూసింది సీతాకుమారి.

"ప్రయాణమయ్యాను. వెళ్ళాలనుకున్నాను. ఇంక దాన్ని ఆపే శక్తి ఆ జగన్నాటక సూత్రధారియైన జనార్ధనుడికే లేదు మిస్టర్ బటర్‌మిల్క్! నా లగేజీ బస్టాపుకు తీసుకువస్తావా? డబ్బులిస్తానులే...''

"వద్దులే అమ్మాయ్‌గారూ! మీరు చేసిన ఆ మహోపకారానికే పైసలేమీ లేకుండా మీ లగేజీ మోసినా, నేనే మీకు ఋణపడి వుంటాను. మీ లగేజీ ఇవ్వండి. బస్టాపుదాకా తీసుకొస్తాను'' అంటూ లగేజీ తీసుకున్నాడు.

అంతలో కొరియర్ అంటూ కవర్ తెచ్చాడొక కుర్రాడు.

"వదినమ్మగోరూ! అదేదో కాగితంమీరే తీసుకోండి...'' అన్నాడు బటర్‌మిల్క్.

సంతకం చేసుకుని కవరు తీసుకున్నది. ఆ తర్వాత కవరు చించి కాగితం తీసి చదివింది. చదివిన తర్వాత 'గుడ్ న్యూస్... గుడ్ న్యూస్' అంటూ సీతాకుమారి అరిచింది. ఆ తర్వాత ఆ కాగితాన్ని బటర్‌మిల్క్‌కు ఇచ్చింది. అతడు అటూ ఇటూ చూశాడు. "అవును నిజమే... గుడ్ న్యూస్... గుడ్ న్యూస్....'' అన్నాడు.

"ఏమిటా గుడ్‌న్యూస్?'' అడిగింది సరోజిని.

"నాకేం తెలుసు? వదినమ్మగోరు గుడ్ న్యూస్ అన్నారు. నేనూ అలాగే అన్నాను. మీరే చదివి చెప్పండి వదినమ్మగారూ...'' అంటూ ఆ కాగితాన్ని సీతాకుమారికిచ్చాడు బటర్‌మిల్క్.

"జనార్ధన్ యు ఆర్ సెలెక్టెడ్ యాజ్ అసిస్టెంటు ఇంజనీర్... ట్రెయినింగ్ విల్ బి కండక్టెడ్ షార్ట్‌లీ...'' చదివి వినిపించి ఆ ప్రక్కనే వున్న బూందీ లడ్డు మరిది చేత తినిపించింది సీతాకుమారి.

"ఈ బటర్‌మిల్క్... జనార్ధన్ గారా....'' అంటూ ఆశ్చర్యంతో పాటు తొట్రుపాటుతో సిగ్గుపడింది సరోజిని.

"సారీ సరోజినిగారూ! మీరు 'మా వదినగారి ప్రాణ స్నేహితురాలని ముందే తెలుసు. మొన్న మ్యారేజీకి మీరు రానందువల్ల నన్ను మీరు, మిమ్మల్ని నేను చూడలేకపోవటం వల్ల, ఈ నాటకం ఆడటానికి అవకాశం కలిగింది. ఈ నాటకం అంతా ముందుగానే మా వదినగారి అనుమతితోనే జరిగింది. నేను తెలిసి నాటకమాడితే మీరు తెలియకుండా, తెలివిగా పరిస్థితులను ఎదుర్కొన్నారు. అందుకు మీరు నన్ను క్షమించానంటేనే ఈ పూట అన్నం తింటాను. లేకుంటే మానేస్తాను...'' అన్నాడు బటర్‌మిల్క్ అనబడే జనార్ధన్.

ఆ మాటలేమీ వినిపించుకోలేదు బేబీ సరోజిని. వినిపించినా సమాధానం చెప్పటానికి సిగ్గు అడ్డుపడింది.

"సరూ! ఇందాకే ప్రయాణమయ్యాను. వెళ్ళాలనుకున్నాను. దాన్ని ఆపే శక్తి ఆ జగన్నాటక సూత్రధారి అయిన జనార్ధనుడికే లేదన్నావుగా. మరింక ఆలస్యమెందుకు? బయలుదేరు...'' అంటూ సుతారంగా చూసింది సీతాకుమారి.

"ఇది నా ప్రాణ స్నేహితురాలి ఇల్లు. నా ఇష్టం వచ్చినన్నాళ్ళు వుంటాను. ఎవ్వరు వెళ్ళమన్నా నేను వెళ్ళను...''

అంతలోకే అక్కడికి వచ్చిన సీతాకుమారి మామగారు పట్టాభిరామయ్య "ఆమె చెప్పింది నిజమేనమ్మా! బేబి సరోజిని ఇక్కడ్నుంచి వెళ్ళమనే హక్కు మనెకవ్వరికీ లేదు. ఆ అమ్మాయికి ఇష్టమైతే సీతలాగే జీవితాంతం ఇక్కడే ఉండిపోవచ్చు.'' అన్నాడు.

"మీ ఐడియా బాగానే ఉంది గానీ మై డియర్ డాడీ! చదువు లేక, అందం చందం లేక, రాక్షసుడిలా వున్న ఈ బటర్‌మిల్క్ ఆ బెనారస్ సిల్క్ గారికి నచ్చొద్దూ!'' అన్నాడు జనార్దన్.

అందరూ నవ్వారు. అయితే వాళ్ళందరి నవ్వుకంటే, లోపల నుంచి కిలకిలమంటూ బేబీ సరోజిని నవ్వుతుంటే, ఇంటిలోని మామిడాకుల తోరణాలు ఉల్లాసంతో అటూ ఇటూ ఊగులాడాయి.

